
## కథ

**“అప్పుడే వెళ్లి పోతున్నారా?...” అడిగింది సరస్వతి. ఆ అడగడంలో ఏ భావమూ లేదు. చందూ నించి జవాబూ లేదు. కొద్ది క్షణాలు ఇద్దరి మధ్య నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ సరస్వతే మళ్లీ అంది” మీతో కొంచెం మాట్లాడాలి. నాకు సాయంత్రం వరకు కుదరదు. అందుకే... ఈ రోజు ఉండడం అవుతుందా?...” ఆ అడగడంలో అభ్యర్థన ఉందో, ఆదేశమే ఉందో అర్థం కాలేదు చందూకి. కానీ ఆమె మాట కాదనలేకపోయాడు. ఎందుకంటే ఇందాక జరిగిన సంఘటనతో ఆమె తనకెక్కడ దూరమౌతుందో” నని భయంగా ఉందతడికి. అలాంటిది. ఈ పలకరింపు కాస్త ఊరట కలిగించింది. అందుకే ఆమె అభ్యర్థనని ఆజ్ఞగానే భావించాడు. ఐనా... తనిందాక అలా ప్రవర్తించి ఉండవలసింది కాదేమో... అన్పించింది. ఆ వెను వెంటనే ఆ సంఘటన అతడి కళ్ల ముందు కదలాడింది.**



# అప్పుడే ఆనందం

అయ్యగారి శ్రీనివాసరావు

“ఒసేయ్ సరస్వతీ! ఇలారమ్మో!” అటుగా వెళుతున్న మూడో కూతుర్ని పిలిచింది తల్లి. ఆ పిలుపు విన్నామె దగ్గరికి రాకుండానే“ఎందుకమ్మా?”అనడిగింది. అంత దూరం వెళ్లే ఓపిక లేక. ఆమెకే కాదు ఇంట్లో ఉన్న అందరికీ అలాగే ఉంది. రాత్రి ఆ ఇంట్లో జరిగిన పెళ్లితో ఇంట్లో ఎవరికీ నిద్ర లేదు. చాలా మంది చుట్టాలు వెళ్లిపోయారు. ముఖ్యమైన వాళ్లు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో ఉండిపోయారు. అదీ కాక పెళ్లి కూతుర్ని అత్తారింటికి పంపే రోజు ఈ రోజు. ఆ హడావుడిలో ఉన్నారు. ఆడవాళ్లంతా. అందుకే కూతురి ఇబ్బంది కనిపెట్టిన తల్లి కూడా అక్కడ్నుంచే జవాబిస్తూ“సరస్వతీ! ఆ కొట్టు గదిలో సారీ సామాన్లున్నాయి. అవన్నీ సర్దు”అంటూ పని పురమాయించింది.

అప్పుడే ఆ పక్క నుంచి వెళుతున్న చందూ చెవిన పడ్డాయి ఆ మాటలు. ఆనందంతో ఉక్కిరిబిక్కిరైపోయాడు. “ఇదొక సువర్ణావకాశం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి” బందరు లడ్డూ లాంటి పడుచు పిల్ల. తనకి ఏకాంతంగా దొరకబోతోంది. బంతి పూవులాంటి ఆమె మేని మెత్తదనం తన చేతికి పరిచయమే. అది గుర్తుకు రాగానే నరాలు జివ్వుమన్నాయి చందూకి.

సన్న జాజి తీగలాంటి నాజూకుతనం, దానికి తగ్గ అందం, ఆ అందానికి తగ్గ చలాకీతనం ఇవన్నీ చూసి ఆమె పై మనసు పడ్డ చందూ సరస్వతికి వరసైనవాడే. మంచి ఉద్యోగం, మెరుగైన ఆదాయం ఉన్నవాడు అదీ కాక బంధువుల ఇంట పెళ్లిలో ఆమెను చూసినచ్చాడు. అందుకే కోరి ఆ పిల్లని చేసుకుంటానని ఆమె తల్లిదండ్రుల్నడిగాడు.

అన్ని విధాల అనుకూలుడు, బంధువు, పైగా మనసుపడి అడిగాడు కాబట్టి ఆమె తల్లిదండ్రులు అభ్యంతరం చెప్పలేదు. కాకపోతే ఆమె కంటే పెద్దామెకి పెళ్లయ్యాకే ఈమెకి చేస్తామని చిన్న షరతు పెట్టారు. ఇప్పుడా పెళ్లి కూడా అయిపోయింది. ఇప్పుడా పెళ్లికే వచ్చాడు. తనకిక లైన్ క్లియర్. “ఆలోచనల్లో ఉన్న చందూ పక్కకి చూసాడు. సరస్వతి అక్కడ లేదు.

అంటే... ఆమె అప్పుడే కొట్టు గదిలోకెళ్లి పోయిందన్నమాట. ఇదే సరైన అదును. పెళ్లి వారంతా ఎవరి హడావుడిలో వారున్నారు. అదీకాక కొట్టు గది ఆ ఇంటికి ఒక మూలగా ఉంటుంది. ప్రత్యేకంగా తప్ప మామూలుగా ఎవరూ ఆ గది వైపు చూడలేరు. ఒకరిద్దరు పొరబాటున చూసినా పర్వాలేదు. ఎందుకంటే తనామెకు కాబోయే భర్త కాబట్టి అదీ కాక సరస్వతి కూడా ఇది వరకులా కాదు. ఇపుడు తన చర్యల్ని ఇష్టపడుతోంది. పెళ్లి కుదిరిన తర్వాత ఒకటి రెండు సార్లు వాళ్లింటికొచ్చినపుడు చనువు తీసుకుంటే ఉరిమి చూసింది. ఆ చూపుల్లో తీక్షణత చూసి వెనకడుగేసాడతను. పెళ్లి కుదరకుండా ఎన్నాళ్లున్నా తట్టుకోవచ్చుగానీ, కుదిరి చెయ్యకుండా ఆపితే మాత్రం ఆ బాధ భరించలేనిది. అందుకే అవకాశం దొరికినప్పుడల్లా వాళ్లింటికొస్తూంటాడు. కొంచెం ఇబ్బందైనా అతడ్నేమనలేక పోతున్నారు సరస్వతి తల్లిదండ్రులు. వచ్చినవాడు తిన్నగా ఉండకుండా సరస్వతిని కవ్వించడానికి కరిగించడానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఆమె అభ్యంతర పెడుతూనే ఉంటుంది. కానీ నిన్న ఆమె అక్క

పెళ్లిలో చెప్పుకోదగినంతగా ఏమీ అభ్యంతరపెట్ట లేదు. తియ్యని జ్ఞాపకం కావడంతో నిన్నటి జ్ఞాపకాల్లోకెళ్లిపోయాడు చందూ.

***

''కాఫీ తీసుకోండి''అందరితో బాటు అతడికీ కాఫీ ఇచ్చింది సరస్వతి. ఆ కప్పు అందుకుంటూ ''బాగున్నావా?''నెమ్మదిగా పలకరించాడు చందూ.

తియ్యగా నవ్వింది. ఆ వెనకే ''బాగున్నాననే కదా! నన్ను చేసుకుంటానని మరీ అడిగారు'' అంది. రెండు క్షణాలు ఆమె అన్నదేమిటో అర్థం కాలేదు. అర్థమయ్యాక ఆమె చమత్కారానికి నవ్వుకున్నాడు.

ఆ తర్వాత పెళ్లి పనుల్లో హడావుడిగా తిరుగుతున్నారు.

అతడికి తారసపడ్డప్పుడల్లా విరిసీ విరియని పువ్వులా నవ్వేది. అలాంటి సమయంలోనే ఒకటి రెండుసార్లు తను కావాలనే శరీరానికి చేతులు తాకించాడు. ఇదివరకులా ఉరిమి చూడలేదు. దాంతో కొద్దిగా ముందుకెళ్లాలనిపించి ఏకాంతం దొరికితే చిలిపి పనులు చేసాడు. అడ్డు చెప్పలేదు. అలాగని ప్రోత్సాహకరంగానూ ప్రవర్తించలేదు. అందుకని మరింత ధైర్యం చేసాడతను.

లగ్నం జరుగుతోంది. కావాలనే ఆమె వెనకగా నిలబడ్డాడు. పూర్వ కాలపు లోగిలి ఇల్లు కావడంతో అక్కడే జరుగుతోంది పెళ్లి. అందరూ ఒక్కసారిగా రావడంతో చాలా ఇరుకుగా తొక్కిసలాటగా ఉందక్కడ. అందరూ పెళ్లి చూడ్డంలో నిమగ్నమై ఉన్నారు. తమనెవరూ గమనించడం లేదు. ఇదే సమయం.... మెల్లగా ఆమె నడుమ్మీద చెయ్యివేసి సున్నితంగా రాసాడు. ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. అక్కడ చందూ దాంతో మరేమనకుండా ముఖం ముందుకి తిప్పుకుంది.

తను చేసిన పనికి ఏ వ్యతిరేకత వ్యక్త పరచలేదంటే... మరింత ధైర్యం వచ్చింది. దాంతో మరింత ముందుకెళ్లాయి అతడి ఆలోచనలూ, చే(త)తులూను. అలా చేయి ముందు కెళుతూంటే ఆమె మళ్లీ వెనక్కి తగ్గింది. క్రింది పెదవిని పై పళ్లతో బిగించి కళ్లు పెద్దవి చేసీ అతడికి మాత్రమే అర్థమయ్యేటట్లు బెదిరించింది. ఏ మాత్రం బెదరలేదు సరికదా! నవ్వుకున్నాడు. ''ఔనంటే కాదనిలే.... కాదంటే ఔననిలే....'' అన్నారు కదా అనుభవజ్ఞులు. అందుకే ఆమె వద్దన్నాదంటే.... అన్పించింది.

అంతే...

తన చేతిని ఆమె నడుం మీద నుంచి మరి కొంచెం ముందుకి జరిపి కడుపు మీదకి పాకించాడు. అంతటితో ఆగలేదు. వేళ్లతో సుతారంగా అక్కడ



రాసాడు. ఆమె గిలిగింతలకు లోనైందని ఆమె కడుపు వెనక్కి లాక్కోవడంతోనే గ్రహించాడు. తను చేస్తున్న ఆ పని వల్ల ఆమె సంగతేమోగాని అతడి శరీరంలో స్థాయీ భావాలు రకరకాలుగా మారుతున్నాయి. దాంతో మరింత విజృంభించాడు. ఆ చేతినలాగే పైకి జరపబోయాడు. జరగబోయే పరిణామాన్ని గ్రహించిన ఆమె అతడి చేతిని ఆమె చేతితో పట్టుకుని ఆపింది. అప్పటికీ పెనుగులాడాడు. గట్టిగా గిచ్చింది. దాంతో అతను చేతిని వెనక్కి తీసుకోక తప్పలేదు. చెయ్యి వెనక్కి తియ్యడమే తడువు ఆమె అక్కడ్నుంచి వెళ్లిపోయింది. అప్పట్నుంచి మరి కనబడలేదు. అందీ అందనట్టు అలా వెళ్లిపోయినామె జ్ఞాపకాలతో నిన్నట్నుంచి వేగిపోతున్నాడు. అలాంటి తనకి ఇప్పుడు... సరస్వతి.... ఇలా... ఏకాంతంగా దొరకబోతుంది. నిన్న ఆమె వెళ్లిపోయాక అందరి మధ్యలో అలా ప్రవర్తించకుండా ఉండవలసింది'' అన్పించింది. కాని ఇప్పుడూ అలాగే ఆ ఇంట్లో చుట్టాలున్నా ఆ మాట గుర్తుకు రాలేదు. అందుకే మధురోహల పల్లకీలో ఊరేగుతూ ఆమె ఉంటుందని తెలిసిన కొట్టు గది వైపు అడుగులేసాడు చందూ.

***

''ఎవరది?'' చీకటిగా ఉన్న గదిలో ఉన్నారు కంగారుగా అడిగింది. గుమ్మం దగ్గర వెలుతురులో ఎవరో కదలాడినట్లు అనిపించిందామెకు. కాని ఆమె ప్రశ్నకి జవాబు లేదు.

గుడ్డి వెలుతురు. అస్పష్టంగా అన్నీ కనబడతాయి. కానీ గుర్తించాలంటే కొంచెం సేపు పడుతుంది. అప్పటికే ఆ ఆకారం గదిలోకి ప్రవేశించిందనే అనుమానం వచ్చింది. కాని ఏ రకమైన జవాబు రాకపోవడంతో తను పొరబడ్డానేమోనన్పించి మళ్లీ తన పనిలో నిమగ్నమైంది.

అంతలోనే వెనకగా తన వీపు మీద వెచ్చని స్పర్శ. అది వేడి నిశ్వాసపు స్పర్శ అని అంతలోనే గ్రహించింది. అంటే... తన వెనకెవరో ఉన్నారు. ఎవరై ... ?వెంటనే స్ఫురణకు వచ్చింది. అందుకే ఏదో అనాలని వెనక్కి తిరగబోయింది. కానీ ఆమెకా అవకాశం ఇవ్వకుండా ఆ చేతులే ఆమెనట్నుంచిటు తిప్పాయి.

''సరూ...!'' చందూ గొంతులోంచి వచ్చిన తమకంతో కూడిన పిలుపు. నెమ్మదిగా ఆమె చెవుల దగ్గర గుసగుసగా వినిపించింది. అంతలోనే ఆమెని ఒడిసి పట్టుకున్న చేతులు ఆమెనింకా ముందుకు లాక్కుంటున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు. తన పెదవులనో, బుగ్గలనో చుంబించే ప్రయత్నం సాగుతోందని ఎదుటి ముఖం నుంచి వచ్చే వెచ్చని ఊపిరి తన ముఖాన్ని తాకడం వల్ల కనిపెట్టింది. ఆ అవకాశం అవతలి వ్యక్తికిస్తే అది అంతటితో ఆగదు. ఎటైనా దారి తీయవచ్చు. అది ఆమెకిష్టం లేదు.

అందుకే చందూ ప్రయత్నాన్ని వమ్ము చేస్తూ ఆమె చేతిని ఆ నాలుగు పెదవుల మధ్యకి తెచ్చి అడ్డు పడింది. అప్పుడు గుర్తించింది. అప్పటికే ఆమె యద అతడి హృదయానికి దగ్గరగా ఉందని. ఆ హాయితో ఏదో మత్తుకి లోనౌతున్నాడని. దాంతో....

అంతవరకూ సాత్వికంగా సాగిన ప్రతిఘటన తాపస స్థితికి చేరింది. అంతే.... విసురుగా అతడ్ని రెండు చేతులతోటి బలంగా వెనక్కి తోసేసి తిరిగి చూడకుండా బయటికెళ్లిపోయింది. అది ఊహించని సంఘటన కావడంతో చందూ ఆ విసురుకి బలంగా వెల్లకిలా పడ్డాడని పైకి లేవడానికి కొద్ది క్షణాలు పట్టిందని ఆమెకు తెలియదు.

***

సుదీర్ఘ నిరీక్షణ అనంతరం సరస్వతి అక్కడికొచ్చింది. ఆమె దగ్గరకు రాగానే ఉదయం సంఘటన మరచిపోయి ''సరూ....!''అని ఆర్తిగా పిలిచాడు. ఇంకేదో అనబోతున్నంతలో...

నా పూర్తి పేరు సరస్వతి. నన్నలా పిలిస్తేనే నచ్చుతుంది. అదీకాక మీరిప్పుడు పిలిచేలాంటి చనువు మన మధ్య లేదు''అంది.

ఆ మాటకి చందూ అవాక్కయ్యాడు. అంతలోనే తేరుకుని ''అది కాదు సరస్వతీ! ఇంతకీ ఎందుకింత ఆలస్యం?''అడిగాడు. ఆమె రమ్మని చెప్పిన చోటుకి వచ్చి చాలా సేపట్నుంచి ఎదురు చూస్తుండడంతో.

ఆ మాట విన్న సరస్వతి ''నేను ఆడదాన్ని కావడమే దానికి కారణం. ఎందుకంటే మీ మగాళ్లలా అన్నింటికీ తెగించలేం చందూగారు''అంది. ఆ మాటలు అతడి హృదయంలో ఎక్కడ తగలాలో అక్కడ తగిలాయి. కాని పట్టించుకోనివాడిలా ''అద్సరేగాని ఇంత బంధుత్వం ఉన్న నన్ను 'గారూ'అని సంబోధించావేమిటి?'' మాట మరుస్తూ అన్నాడు.

ఆ మాటకి సరస్వతి ''నువ్వు'' అని పిలిచేంత దగ్గరి బంధుత్వం కాదు మనది. అదీకాక అయితే, గియితే మీరు నా భర్త అయ్యాక ఏకవచనంలో సంబోధించడం ఎలాగూ కుదరదు. ఈ మాత్రం భాగ్యానికి ఈ ఒక్కసారికీ ఏకవచన సంబోధన ఎందుకు?''అంది.

అయితే..గియితే అంటున్నావు. నన్ను చేసుకోవడం నీకిష్టంలేదేంటి కొంపదీసి'' అన్నాడు నవ్వుతూ. పైకలా నవ్వాడేగాని మనసులో గుబులుగానే ఉంది.

ఆ మాటకి ''ఈ సమాజంలో ఆడపిల్ల అభిప్రాయాలతోటి ఇష్టా ఇష్టాలతోటి ఎవరికి సంబంధం?'' ఎదురు ప్రశ్నించింది.

ఆ మాటకి చందూ ''ఏం జరిగింది సరస్వతీ? నీకీ పెళ్లి ఇష్టంలేదా? ఎందుకంటే రెండువైపులా ఇష్టం ఉంటేనేకదండీ ఏ పనైనా విజయవంతమయ్యేది''నిజాయితీగా అన్నాడు. ఆ మాట విన్న సరస్వతి... ఔనుకదా! అలాగే ఏ సమయంలో చేయవలసిన పని ఆ సమయంలో, ఏ ప్రదేశంలో చేసే పని ఆ ప్రదేశంలో చేస్తేనే అందం ''అంది.

''ఆ చెప్పేదేదో సూటిగా చెబితే బాగుంటుందేమో!''అన్నాడు చందూ. ఆమె ఏ భావంతో అందో అప్పటికే గ్రహించాడతడు.

ఇంక దాపరికమెందుకని ఆమె చెప్పదలచుకున్న విషయం సూటిగా చెప్పింది. ఆ మాటకు సిగ్గు పడుతూ ''అది కాదు సరస్వతీ! నేను చెడు ఆలోచనల్తో అలా చెయ్యలేదు. అసలు నా ఉద్దేశ్యమేమిటంటే.... ''ఇంకా చెప్పబోయాడు. కాని అతడి మాటకడ్డుపడింది సరస్వతి.

''చూడండి చందూగారూ మీరే ఉద్దేశ్యంతో చేసినా అది మంచి పని కాదు కదా! ఆకలిగా ఉంది కదా అని ఎక్కడ బడితే అక్కడ, ఏదిబడితే అది తినేస్తామా? దానికీ ఒక నియమం, నిష్ట ఉంటేనే ఆ తిండి ఒంటబడుతుంది. అలాగే ఏదో చిన్న ప్రలోభాలకు లోనైపోయి చిలక్కొట్టుళ్లు కొడితే అసలు విస్తారంగా గడిచిపోతాయా క్షణాలు. ఎప్పుడేతే నిర్లిప్తత చోటు చేసుకుందో ఇక జీవితం మీద ఆసక్తి పోతుంది. ఆసక్తిపోతే స్తబ్దత, ఆ స్తబ్దత వల్ల ఎన్నో అనర్థాలు అయినా ఎందుకండీ ఈ ఆత్రం? సంపూర్ణమైన ప్రేమానురాగాలతో సర్వం మీదే కాబోయే క్షణాలు అతి దగ్గరలో వుండగా ఈ పనులెందుకండీ? నిన్నటి సంఘటనగాని, పొద్దున మనిద్దర్నీ ఆ స్థితిలోగాని ఎవరైనా చూస్తే ''లేకివాళ్లు'' ''నంగిరి వాళ్లు'' అనే ముద్ర తప్ప మనకేం గౌరవం మిగిలేది?.... ''ఇంకా ఏదో చెప్పాలని ఉన్నా అన్నీ తెలిసినతడు ఆ మాటల్ని అర్థం చేసుకోలేని పసివాడేం కాదని పంచి చెప్పలేదు.

కొన్ని క్షణాలు వారిద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది. ఆ మౌనాన్ని భగ్నం చేస్తూ చందూ ''సారీ సరస్వతి! నా దాని వనే ఆతృతతో అలా ప్రవర్తించాను గాని ఇంతలోతుగా ఆలోచించలేదు. అయినా ఆ ఆనంద కరమైన క్షణాలు ఇంకెంతో దూరం లేవుగా అంతవరకూ ఎదురు చూస్తుంటాను. ఆ పై అంతా ఆనందమే కదా?'' అన్నాడు కొంచెం కొంటెదనం కలగలిపి నవ్వుతూ.

సరస్వతి మాత్రం ''అప్పుడే అసలైన ఆనందం'' అనుకుంది. పైకి మాత్రం చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

★

